# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 3 | సంచిక: 301 | పేజీలు: 4 | వెల: రూ.4/- | శనివారం 27 జూన్ 2026 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## రేవంత్‌కు రాష్ట్ర ప్రగతిపై శ్రద్ధ లేదు: కేటీఆర్

### ఆయన రెన్యువల్ సీఎం

**చేవెళ్ల, జూన్ 26 (నమస్తే ఉదయం)**

'రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు.. ఆయన రెన్యువల్ సీఎం.. ఇప్పటి వరకు 72 సార్లు ఢిల్లీకి వెళ్లి వచ్చారు.. తన పదవిని కాపాడుకోవడం.. మూటలు అక్కడికి తీసుకెళ్లడంపై పెట్టిన శ్రద్ధ.. రాష్ట్ర అభివృద్ధిపై చూపడం లేదు' అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. గురువారం చేవెళ్లలో భారాస నియోజకవర్గ కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్‌పై శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రతి మహిళకూ మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఇస్తామని ఎన్నికల్లో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని.. ఐదేళ్లకు కలిపి ఒక్కో మహిళకు రూ.లక్షన్నర ఇవ్వాలని.. ఆ డబ్బులు వారి అకౌంట్లలో జమ చేస్తే.. తాను రాజకీయాల నుంచి వైదొలగుతానని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు రూ.72 వేల కోట్ల అప్పు ఉంటే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేసిందన్నారు. కాంగ్రెస్ సర్కారు రెండున్నరేళ్లలోనే రూ.4 లక్షల కోట్ల అప్పు చేసిందని విమర్శించారు. చేవెళ్ల ప్రాంతాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ఘనత తమకే ..మిగతా 2లో



## "డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు
# ప్రజలంతా ఏకం కావాలి



### చట్టాలెన్ని చేసినా... ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతం
### సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

మత్తు పదార్థాల మహమ్మారిని రూపుమాపి, ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రజలంతా ఏకం కావాలని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వారు ప్రత్యేక సందేశాలు జారీ చేశారు. డ్రగ్స్ అలవాటు వ్యక్తుల జీవితాలనే కాకుండా కుటుంబాలను నాశనం చేస్తూ.. తీవ్ర శాంతి, భద్రతల సమస్యలకు కారణం అవుతోందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక, అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు కీలక సందేశం ఇచ్చారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తు మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పౌరులంతా చేతులు కలపాలని శుక్రవారం పిలుపునిచ్చారు. యువతను ఈ వ్యసనం నుంచి కాపాడుకోవడం ద్వారానే దేశ భవిష్యత్తును సురక్షితం చేయగలమని స్పష్టం చేశారు.

**ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరమంటూ..!**

ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వ్యసనం అనేది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే పరిమితం కాదని, అది ఒక కుటుంబంతో పాటు యావత్ సమాజాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ సంపద అయిన యువత ఈ మాయలో పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. యువతంతా చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, మంచి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని కోరారు. 'డ్రగ్స్ రహిత తెలంగాణ -- డ్రగ్స్ రహిత భారతదేశం' అనే గొప్ప లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్క పౌరుడు నడుం బిగించాలని గవర్నర్ పిలుపునిచ్చారు.

**డ్రగ్స్ ఉనికిని కనిపెట్టడం పౌరుల బాధ్యత కూడా..!**

మత్తు పదార్థాల వినియోగం కేవలం వ్యక్తిగత వినాశనానికే కాకుండా, సమాజంలో అనేక నేరాలకు, తీవ్రమైన శాంతి భద్రతల సమస్యలకు దారి తీస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కిచెప్పారు. డ్రగ్స్ ఉనికిని కనిపెట్టడంలో, వాటి అక్రమ రవాణాను అడ్డుకోవడంలో కేవలం పోలీసులు, ప్రభుత్వాలే కాకుండా పౌరుల అప్రమత్తత, సామాజిక బాధ్యత ఎంతో కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. యువతలో నిరాశ, నిస్పృహలను దూరం చేసి.. వారిలో సానుకూల ఆలోచనలను పెంపొందించేందుకు సమాజం కృషి చేయాలన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చే పవిత్ర యజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు ..మిగతా 2లో

## డ్రగ్స్ బారిన పడకుండా యువత
# జాగ్రత్త పడాలి

### డ్రగ్స్ రహిత తెలంగాణ మా లక్ష్యం
### డ్రగ్స్‌పై పోరాటంలో ఈగిల్ ఫోర్స్ కృషి అసామాన్యం
### ఈగిల్ ఫోర్స్ డ్రగ్స్ నిర్మూలన కార్యక్రమంలో భట్టి



**హైదరాబాద్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

విలువైన జీవితాన్ని డ్రగ్స్ బారిన పడి నాశనం చేసుకోవద్దని విద్యార్థులు, యువతకు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ మహమ్మారి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని, అందరం కలిసికట్టుగా పోరాడినప్పుడే డ్రగ్స్ లేని సమాజాన్ని సాధించగలమని పిలుపునిచ్చారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ప్రత్యేకంగా పనిచేస్తున్న ఈగల్ ఫోర్స్‌కు ఆర్థికంగా ఎలాంటి లోటు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారాన్ని అందిస్తుందని భరోసా ఇచ్చారు. తమ పిల్లలు ఉన్నత స్థానాల్లో ఉండాలని కోరుకునే తల్లిదండ్రుల ఆశ, రాష్ట్ర ప్రభుత్వ కల ఒక్కటేనని.. అది యువత డ్రగ్స్ బారిన పడకుండా ఉండటమేనని ఉద్ఘాటించారు. శిల్పకళా వేదికలో నిర్వహించిన ..మిగతా 2లో

## తెలంగాణ సీఎస్‌గా
# సంజయ్ జాజు

కేంద్ర ప్రభుత్వంలో కీలక పదవులు ...



2

## ఆన్‌లైన్‌లోనూ
# సర్

### సర్ ప్రక్రియపై కీలక ప్రకటన

2



### హైదరాబాద్-అమరావతి-చెన్నై
# హైస్పీడ్ కారిడార్

### తిరుపతికి 2 బుల్లెట్ ట్రైన్స్!!
### హైదరాబాద్-చెన్నైమార్గం గుండా తిరుపతి
### ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదన
### ప్రతిపాదనకు లభించిన ప్రాథమిక అంగీకారం
### త్వరలోనే కార్యరూపం దాల్చనున్న ప్రాజెక్టు

**తిరుపతి, జూన్ 26 (నమస్తే ఉదయం)**

దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన హైస్పీడ్ బుల్లెట్ రైలు ప్రాజెక్టుల మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కీలక కేంద్రంగా మారనుంది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్‌ను రాజధాని అమరావతి మీదుగా నిర్మించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్హెచ్ఎస్ఆర్సీఎల్) సానుకూలంగా స్పందించింది. అదే సమయంలో చెన్నై-బెంగళూరు కారిడార్‌లోని చిత్తూరును, హైదరాబాద్-చెన్నై మార్గంలోని తిరుపతితో అనుసంధానించే ప్రత్యేక బుల్లెట్ రైలు లింక్ కారిడార్ ప్రతిపాదనకు సైతం ప్రాథమిక అంగీకారం లభించింది. ఈ కీలక నిర్ణయంతో దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలన్నీ ఒకే నెట్‌వర్క్‌తో అనుసంధానమయ్యే అద్భుత అవకాశం ..మిగతా 2లో

## దేశంలోనే సరికొత్త
# అధ్యాయానికి నాంది

### హైదరాబాద్‌లో తొలి 'డేటా సెంటర్ సిటీ'



### 1,500 ఎకరాల విస్తీర్ణంలో భారీ నగరం
### వికారాబాద్ జిల్లా చేవెళ్ల త్వరలో ఏర్పాటు
### సమగ్ర నివేదిక సిద్ధం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

సాంకేతిక రంగంలో ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న హైదరాబాద్ మహానగరం, ఇప్పుడు మరో సంచలన ప్రాజెక్టుకు వేదిక కాబోతోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ , క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ..మిగతా 2లో

## ఝార్ఖండ్‌లో ఘోర
# రోడ్డు ప్రమాదం

### ప్రయాణికుల వ్యానును ఢీకొన్న లారీ
### ఏడుగురు అక్కడికక్కడే మృతి



**రామ్‌గఢ్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

ఝార్ఖండ్‌లోని రామ్‌గఢ్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బొగ్గుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న ప్రయాణికుల వ్యానును ఢీకొట్టడంతో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స కోసం రాంచీకి తరలించారు. ఈ ప్రమాదంతో ప్రాంతమంతా విషాదంలో మునిగిపోయింది. మృతులంతా బ్యాండ్, తాషా బృందానికి చెందిన కళాకారులేనని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదం గురువారం ..మిగతా 2లో

# డ్రగ్స్ బారిన పడకుండా యువత జాగ్రత్త పడాలి

మొదటి పేజీ తరువాయి...

ఈగల్ ఫోర్స్ యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, సినీనటులు రామ్ పోతినేని, మీనాక్షి చౌదరి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తారు. ఈ ప్రభుత్వం కూడా వారిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తోంది. సమాజ శ్రేయస్సు కోసం పోలీసులు ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొంటున్నారు. తమ జీవితాలను రిస్క్‌లో పెట్టి డ్రగ్స్ ముఠాలను పట్టుకుంటున్నారు. డ్రగ్స్ కేసుల్లో దొరికితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని భట్టి హెచ్చరించారు. ఈగల్ ఫోర్స్ సంపూర్ణంగా పనిచేసేలా అన్ని వసతులు కల్పించాం. డ్రగ్స్ కట్టడికి ఎలాంటి కఠిన నిర్ణయమైనా తీసుకుంటాం. తెలంగాణలో పుట్టిపెరగడం ఓ భరోసాగా భావించే పరిస్థితులు కల్పిస్తున్నాం. సమాజంలో పరివర్తన రాకుంటే ఎన్ని చట్టాలు చేసినా ప్రయోజనం శూన్యం. సినీ నటులు ఇచ్చే సందేశం సమాజంలోకి బలంగా వెళ్తుందని భట్టి విక్రమార్క అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రాణాలకు తెగించి, నిరంతరం రిస్క్‌లో పనిచేస్తున్న పోలీస్ అధికారుల, సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, అందులో భాగంగానే అలాంటి ఉద్యోగులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం ప్రకటించారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని నమ్ముతూ, డ్రగ్స్ మహమ్మారిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రత్యేక అవేర్‌నెస్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్యంగా విద్యావ్యవస్థ బలోపేతం, రాష్ట్ర రక్షణ విషయాలలో ప్రభుత్వం ఎంతో కఠినంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. డ్రగ్స్ రవాణా లేదా వినియోగంలో ఎంతటి పెద్దవారు, ఎంతటి ప్రభావశీలురు ఉన్నా సరే ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తి లేదని భట్టి విక్రమార్క తీవ్రంగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చలనచిత్ర రంగానికి చెందిన హీరోలు, హీరోయిన్లు, ఇతర కళాకారులు డ్రగ్స్ వ్యతిరేక ప్రచారంలో చురుగ్గా పాల్గొనాలని శిల్పకళా వేదిక నుంచి ఆయన విజ్ఞప్తి చేశారు. సినీ పరిశ్రమలో ఉన్నవారు కూడా సమాజం పట్ల బాధ్యతగా మెలగాలని, డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వానికి తమవంతు సహకారం అందించాలని కోరారు. ప్రభుత్వం తరఫున కఠినమైన చట్టాలు చేస్తున్నప్పటికీ, ప్రజల్లో మార్పు రానంతవరకు ఆశించిన ఫలితాలు రావని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. దేశంలో వరకట్న నిషేధ చట్టం ఉన్నప్పటికీ, అది ఆశించిన స్థాయిలో అమలు కాకపోవడానికి సామాజిక మార్పు లోపించడమే కారణమని ఉదాహరించారు. డ్రగ్స్ నిర్మూలన వంటి కఠినమైన చట్టాలు వంద శాతం విజయవంతం కావాలంటే, చట్టాలతో పాటు సమాజంలో, ప్రజల ఆలోచనా విధానంలో స్పష్టమైన పరివర్తన రావాలని ఆయన ఆకాంక్షించారు.

# ఝార్ఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

అర్ధరాత్రి సమయంలో రామ్‌గఢ్ జిల్లాలోని రజరప్ప పోలీస్‌స్టేషన్ పరిధిలో లారి-బర్లొంగ్ సమీపంలోని రామ్‌గఢ్-బొకారో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-23)పై జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా దెబ్బతిన్న వ్యానులో చిక్కుకున్న వారిని బయటకు తీసి రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రికి తరలించారు. అయితే వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉండటంతో రాంచీలోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బల్సగరా ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, మారంగ్‌మర్చా గ్రామానికి చెందిన బ్యాండ్-తాషా బృంద సభ్యులు ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వ్యానులో వెళ్లారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మొత్తం అంతా ఒకే వాహనంలో తిరిగి బల్సగరా వైపు బయలుదేరారు. ఇదే సమయంలో రామ్‌గఢ్ వైపు నుంచి వేగంగా వస్తున్న బొగ్గు లారీ ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన వ్యానును ఢీకొట్టింది. లారీ ఢీకొట్టిన వేగానికి వ్యాను పూర్తిగా ధ్వంసమైంది. వాహనం ముందు భాగం నుజ్జునుజ్జు కావడంతో అందులో ప్రయాణిస్తున్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుల్లో ఆరుగురు మారంగ్‌మర్చా గ్రామానికి, ఇద్దరు బల్సగరా ప్రాంతానికి చెందిన వారిగా భావిస్తున్నప్పటికీ అధికారికంగా ఇంకా పూర్తి వివరాలు వెల్లడించలేదు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది సహాయంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. రామ్‌గఢ్ సదర్ ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, మొత్తం ఎనిమిది మందిని ఆస్పత్రికి తీసుకువచ్చారని, వారిలో ఏడుగురు అప్పటికే మృతి చెందారని చెప్పారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని మెరుగైన చికిత్స కోసం రాంచీకి పంపినట్లు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. రామ్‌గఢ్ ఎస్‌డీపీఓ ఆలోక్ రంజన్ మాట్లాడుతూ, ప్రాథమిక దర్యాప్తులో లారీ రాంగ్‌సైడ్‌లోకి వచ్చి వ్యానును ఢీకొట్టినట్లు తెలుస్తోందన్నారు. వ్యానులో బ్యాండ్-తాషా బృంద సభ్యులు ప్రయాణిస్తున్నారని తెలిపారు. ఢీకొట్టిన తీవ్రతకు వాహనం పూర్తిగా ధ్వంసమైందని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ ప్రమాదంతో మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రామ్‌గఢ్-బొకారో జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. దీంతో రహదారిపై రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. స్థానిక ప్రజలతో అధికారులు చర్చలు జరిపి రహదారి దిగ్బంధాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ శాశ్వత భద్రతా చర్యలు తీసుకోవడం లేదన్నారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్ కారణంగా అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలకు కారణమవుతున్న ఈ ప్రాంతాన్ని 'బ్లాక్ స్పాట్'గా గుర్తించి వెంటనే రక్షణ చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానికుల సమాచారం ప్రకారం ఇదే ప్రాంతంలో గత నాలుగు రోజుల వ్యవధిలోనే పదిమందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రహదారిపై వేగ నియంత్రణ చర్యలు, హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ పర్యవేక్షణను పెంచాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుల పూర్తి వివరాలు, ప్రమాదానికి దారితీసిన ఖచ్చితమైన కారణాలను వెలికితీసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

# హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్

మొదటి పేజీ తరువాయి...

ఏర్పడింది. హైదరాబాద్-అమరావతి-చెన్నై హైస్పీడ్ కారిడార్ మొత్తం 760.09 కిలోమీటర్ల మేర మూడు రాష్ట్రాల మీదుగా విస్తరించనుంది. ఇందులో తెలంగాణలో 180.32 కిలోమీటర్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అత్యధికంగా 518.54 కిలోమీటర్ల మేర మార్గం ఉండనుంది. తమిళనాడులో 61.23 కిలోమీటర్ల మేర ఈ మార్గం సాగుతుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా మొత్తం 18 స్టేషన్లను ప్రతిపాదించారు. తెలంగాణలో హైదరాబాద్, శంషాబాద్ సహా ఆరు స్టేషన్లు ఉండగా, ఆంధ్రప్రదేశ్‌లో అమరావతి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలతో కలిపి తొమ్మిది స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు.రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు చిత్తూరు-తిరుపతి మధ్య సుమారు 65 కిలోమీటర్ల పొడవున ప్రత్యేక హైస్పీడ్ లింక్ కారిడార్ ఏర్పాటును ఎన్హెచ్‌ఎస్‌ఆర్సీఎల్ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. దీనికోసం తుది స్థల నిర్ధారణ సర్వే, వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) తయారీకి సంస్థ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నివేదిక సిద్ధమైన వెంటనే కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖకు పంపి తుది ఆమోదం తీసుకోనున్నారు. ఈ లింక్ కారిడార్ అందుబాటులోకి వస్తే, బెంగళూరు నుంచి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతి వరకు నేరుగా బుల్లెట్ రైలులో ప్రయాణించే వెసులుబాటు కలుగుతుంది.మరోవైపు 306 కిలోమీటర్ల పొడవైన చెన్నై-బెంగళూరు హైస్పీడ్ కారిడార్‌లో చిత్తూరు ప్రధాన స్టేషన్‌గా నిలవనుంది. ఇందులో తమిళనాడులో 133 కిలోమీటర్లు, కర్ణాటకలో 101 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్‌లో 72 కిలోమీటర్ల మార్గం ఉండనుంది. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తం ఏడు స్టేషన్లను ప్రతిపాదించారు. ఈ నెట్‌వర్క్ పూర్తయితే పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాలకు ఊహించని రీతిలో భారీ ఊతం లభిస్తుంది. ముఖ్యంగా తిరుమల పుణ్యక్షేత్రానికి వచ్చే లక్షలాది భక్తులకు అత్యంత వేగవంతమైన రవాణా సౌకర్యం అందుబాటులోకి రానుంది.ఈ బుల్లెట్ రైలు ప్రాజెక్టులతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ భారత హైస్పీడ్ రైలు వ్యవస్థకు కేంద్ర బిందువుగా మారుతోంది. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, అమరావతి నగరాలను ఒకే నెట్‌వర్క్‌లో అనుసంధానం చేయడం ద్వారా భారీగా పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉంది. పరిశ్రమలు విస్తరించడం, ఉపాధి అవకాశాలు పెరగడం వంటి సానుకూల ఫలితాలు రాష్ట్రానికి దక్కనున్నాయి. ప్రస్తుతం సర్వేలు, డీపీఆర్ తయారీ ప్రక్రియలను వేగవంతం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను ఆదేశించడంతో ఈ కలల ప్రాజెక్టు త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. ఈ ప్రాజెక్టు అమలుతో రవాణా సమయం భారీగా తగ్గడమే కాకుండా, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఈ హైస్పీడ్ మార్గాలు దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో కీలక పాత్ర పోషించనున్నాయి. పర్యాటక రంగానికి కూడా ఈ బుల్లెట్ రైళ్లు కొత్త ఊపిరిని పోయనున్నాయి. ఏపీ కేంద్రంగా సాగే ఈ అభివృద్ధి ప్రయాణం రాబోయే కాలంలో అనేక మైలురాళ్లను అధిగమించనుంది. ప్రస్తుతం అధికారులు సర్వే పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. భూసేకరణ, సాంకేతిక అనుమతుల విషయంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కోసం నిధులను కూడా దశలవారీగా విడుదల చేసేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. బుల్లెట్ రైలు రాకతో ఏపీ మౌలిక వసతులు ప్రపంచ స్థాయికి చేరుకోవడమే కాకుండా, దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు మార్గం సుగమం కానుంది.

# ఆన్‌లైన్‌లోనూ సర్

హైదరాబాద్ జూన్ 26 (నమస్తే ఉదయం)

తెలంగాణ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో అత్యున్నత స్థాయిలో ఒక కీలక మార్పు చోటుచేసుకుంది. రాష్ట్ర నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు నియమితులయ్యారు. ప్రస్తుతం సీఎస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె. రామకృష్ణారావు సుదీర్ఘ పదవీ కాలం పొడిగించిన గడువుతో సహా జూన్ 30తో ముగియనుంది. అదే రోజున సంజయ్ జాజు రాష్ట్ర అత్యున్నత బ్యూరోక్రాటిక పదవిని స్వీకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక అభ్యర్థన మేరకు కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆయన్ను కేంద్ర సర్వీసుల నుండి రిలీవ్ చేసి మాతృ కేడర్‌కు పంపిన మరుసటి రోజే ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. సంజయ్ జాజుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్రంలోనూ అత్యంత సమర్థుడైన అధికారిగా పేరుంది. 1992 బ్యాచ్ తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారి అయిన ఆయన గతంలో ఉమ్మడి ఏపీలో ఐటీ డిపార్ట్‌మెంట్ సెక్రటరీగా పనిచేసినప్పుడు నేటికీ ప్రజలకు అందుబాటులో ఉన్న విప్లవాత్మక డిజిటల్ సేవలైన మీసేవ , మున్సిపల్ పరిధిలో సౌకర్యం ప్రాజెక్టులను డిజైన్ చేసి అమలు చేసిన ఘనత సాధించారు. అంతేకాకుండా, గతంలో ఉమ్మడి హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్‌గా, విభజన తర్వాత ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రతినిధిగా పలు హోదాల్లో సేవలందించి క్షేత్రస్థాయి పరిపాలనపై తిరుగులేని పట్టు సాధించారు. సంజయ్ జాజు గత 13 ఏళ్లుగా కేంద్ర సర్వీసుల్లో డెప్యుటేషన్‌పై అత్యంత కీలక బాధ్యతలు నిర్వర్తించారు. కేంద్ర రక్షణ ఉత్పాదక శాఖ , కేంద్ర సమాచార-ప్రసారాల శాఖ సెక్రటరీగా దేశ డిజిటల్, రక్షణ రంగాల విధాన నిర్ణయాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణకు తిరిగి వచ్చే ముందు ఆయన కేంద్ర ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. కేంద్రంలో సుదీర్ఘ కాలం పనిచేయడం వల్ల ఢిల్లీ సర్కిళ్లలో గల ఉన్నతాధికారులు, వివిధ మంత్రిత్వ శాఖలతో ఆయనకు ఉన్న బలమైన నెట్‌వర్క్ రాష్ట్ర ప్రయోజనాలకు ఎంతగానో ఉపయోగపడనుందని సచివాలయ వర్గాలు భావిస్తున్నాయి.ప్రస్తుత సీఎస్ రామకృష్ణారావు పదవీ విరమణ తరుణంలో రేసులో జయేష్ రంజన్, వికాస్ రాజ్ వంటి పలువురు సీనియర్ల పేర్లు వినిపించినప్పటికీ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మాత్రం సంజయ్ జాజు వైపే మొగ్గు చూపారు. దీనికి ప్రధాన కారణం ఆయనకున్న క్లీన్ ఇమేజ్ , వివాదరహిత ట్రాక్ రికార్డ్. రాష్ట్రంలో గుణాత్మక మార్పులు, పాలనా సంస్కరణలు తేవాలని భావిస్తున్న రేవంత్ రెడ్డికి ఐటీ, డిజిటల్ పరిపాలనలో ఎక్సపర్ట్ అయిన జాజు అయితేనే కరెక్ట అని భావించారు. అంతేకాకుండా, కేంద్ర నిధుల సాధనలోను, కేంద్ర-రాష్ట్రాల మధ్య పెండింగ్ జలవివాదాలు, విభజన సమస్యల పరిష్కారంలో జాజుకు ఢిల్లీలో ఉన్న సీనియారిటీ, పట్టు రాష్ట్ర ప్రభుత్వానికి శ్రీరామరక్షగా మారుతుందని సీఎం గట్టిగా విశ్వసించారు. దాదాపు 13 ఏళ్ల తర్వాత మాతృ రాష్ట్రానికి తిరిగి వస్తున్న సంజయ్ జాజుకు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించగానే పలు సవాళ్లు ఎదురు కానున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న గ్యారెంటీల అమలు, రాష్ట్ర ఆర్థిక వనరుల సమీకరణ, పారిశ్రామిక అభివృద్ధి, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి పరిపాలనా యంత్రాంగాన్ని పరుగులు పెట్టించాల్సి ఉంటుంది.

## ఆన్‌లైన్‌లోనూ సర్

న్యూఢిల్లీ, జూన్ 26 (నమస్తే ఉదయం)

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్వే ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. జులై 24వ తేదీ వరకు దీనిని నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. ఈ ప్రక్రియల భాగంగా బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను అందిస్తున్నారు. ఓటర్లు వీటికి పూర్తి చేసిన తర్వాత బీఎల్‌వోలకు అందించాల్సి ఉంటుంది. ఎన్యూమరేషన్ ఫారంలు అందించిన రెండు, మూడు రోజుల తర్వాత బీఎల్‌వోలు మళ్లీ ఇంటింటికి వెళ్లి ఈ ఫారాలను స్వీకరిస్తారు. తెలుగులో కూడా ఈ పత్రాలు ఉంటాయి. దీంతో నిరక్షరాస్యులు కూడా సులువుగా అర్థం చేసుకుని ఫారం నింపవచ్చు. ప్రతీ రోజు 50 ఇళ్లకు వెళ్లి బీఎల్‌వోలు ఈ దరఖాస్తులను అందించాల్సి ఉంటుంది. గడువు తేదీలోపు ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్‌వోలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఈ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు చోటుచేసుకోకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులు చూస్తున్నారు. ఎలాంటి విమర్శలు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెలంగాణలో మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉన్నారు. వీరందరికి బీఎల్‌వోలు అందించాలి. అనతరం ఓటర్లు వాటిని పూర్తి చేసి తిరిగి అందించాలి. బీఎల్‌వోలు తీసుకోకపోతే ఈసీ టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. జులై 24వ తేదీలోపు వీటిని ఓటర్లందరూ అందించాల్సి ఉంటుంది. అయితే ఆఫ్‌లైన్‌లోనే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా ఎన్యూమరేషన్ ఫారం నింపవచ్చు. ఈ విషయం చాలామందికి తెలియక ఆన్‌లైన్ సౌకర్యం ఉపయోగించుకోలేకపోతున్నారు. ఎమ్యూనరేషన్ పత్రాలను ఈసీ వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చు. మొబైల్ నెంబర్ ద్వారా ఓటీపీతో లాగిన్ అయ్యి సులువుగా ఫారం నింపవచ్చు. ఆఫ్‌లైన్ లేదా ఆన్లైన్.. ఈ రెండిటిల్లో ఏ విధానం ద్వారా అయినా సమర్పించవచ్చు.



# రేవంత్‌కు రాష్ట్ర ప్రగతిపై శ్రద్ధ లేదు: కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

దక్కుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి వల్లే స్థిరాస్తి రంగం కుప్పకూలిందని ఆరోపించారు.

**మళ్లీ కేసీఆరే సీఎం..**

గతాన్ని మరచిపోయి.. తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలని కేటీఆర్ కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తల బాగోగులు.. ప్రజల సంక్షేమం తన బాధ్యతని ప్రకటించారు. 2028లో కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని ప్రకటించడంతో కార్యకర్తలు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, నేతలు పట్నం నరేందర్‌రెడ్డి, డా.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# "డ్రగ్స్ మహమ్మారిని అంతం చేసేందుకు ప్రజలంతా ఏకం కావాలి

మొదటి పేజీ తరువాయి...

కావాలని సీఎం కోరారు.

**వికారాబాద్‌లో 2కే రన్.. అవగాహన సదస్సులు**

ఈ అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక '2కే రన్'ను తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అధికారికంగా జెండా ఊపి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా యువత, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున ఈ పరుగులో పాల్గొని నినాదాలు చేశారు.

# భవిష్యత్ తయారీ రంగాన్ని మేధస్సు నడిపిస్తుంది

మొదటి పేజీ తరువాయి...

చేస్తున్నాయి, ఎంత తెలివిగా పనిచేస్తున్నాయన్నదే కీలకం అని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెట్టుబడిదారులను సంపద సృష్టికర్తలుగా చూస్తుందని, అన్ని స్థాయిల పరిశ్రమలకు అనుకూలమైన వ్యాపార వాతావరణం కల్పించడానికి కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.పెద్ద పరిశ్రమలకు మాత్రమే కాకుండా, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కూడా పూర్తి ప్రయోజనం పొందాలి.చిన్న వ్యాపారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి రాకూడదని ఆయన పేర్కొన్నారు .తెలంగాణ పారిశ్రామిక భవిష్యత్తు ఆవిష్కరణ, సుస్థిరత, నైపుణ్యాల అభివృద్ధి బలోపేతం, భాగస్వామ్యాలు అనే ఐదు స్తంభాలపై నిలబడిందని వివరించిన మల్లు భట్టి విక్రమార్క్, ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్య మోడల్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. ఈ లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వం ఒక్కటే కాదు, ప్రైవేట్ రంగం కూడా ముందుకు రావాలి. కలిసి హరిత, స్మార్ట్, ప్రపంచ స్థాయి పోటీ సామర్థ్యం కలిగిన తెలంగాణను నిర్మిద్దాం అని ఆయన ప్రకటించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్డు పన్ను మినహాయింపు, సౌర విద్యుత్ సామర్థ్యాన్ని 2035 నాటికి 34 మేగావాట్లకు పెంచడం వంటి చర్యల ద్వారా రాష్ట్రం హరిత ఇంధన రంగంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సంస్థ అధికారులు నాయకులు,పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశంలోనే సరికొత్త అధ్యాయానికి నాంది

మొదటి పేజీ తరువాయి...

డిమాండ్‌ను తట్టుకునేందుకు భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా, కేవలం డేటా సెంటర్ల కోసమే ఒక పూర్తి 'డేటా సెంటర్ నగరాన్ని' అభివృద్ధి చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో ఈ ప్రాజెక్ట్ దేశంలోనే ఒక సరికొత్త అధ్యాయానికి నాంది పలకనుంది. హైదరాబాద్‌కు సుమారు 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న వికారాబాద్ జిల్లా చేవెళ్ల మండలం ఆలూరు గ్రామంలో దాదాపు 1,500 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఈ అత్యాధునిక డేటా సెంటర్ నగరాన్ని నిర్మించనున్నారు. డేటా సెంటర్లు అంటే కేవలం కంప్యూటర్లు ఉండే భవనాలు మాత్రమే కాదు. వాటిలో వేలాది హై-ఎండ్ సర్వర్లు ఉంటాయి. వాటిని నిరంతరం రన్ చేయడానికి, సురక్షితంగా ఉంచడానికి విస్తృతమైన శీతలీకరణ వ్యవస్థలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, భారీ ట్రాన్స్‌ఫార్మర్లు, నెట్‌వర్క్ పరికరాలు, భవిష్యత్ విస్తరణకు భారీ స్థలం అవసరం. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం 1,500 ఎకరాల భూమిని కేటాయించారు. డేటా సెంటర్ సిటీలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్ రంగాలకు ప్రత్యేక మౌలిక వసతులు కల్పించనున్నారు. హైసెక్యూరిటీ జోన్లు, అత్యాధునిక ఫైబర్ కనెక్టివిటీ, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, డిజిటల్ నెట్‌వర్క్ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టు రూపకల్పన జరుగుతోంది. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్, రవాణా, డిజిటల్ కనెక్టివిటీపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. భూమి గుర్తింపు ప్రక్రియ కూడా పూర్తయినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ ఈ ప్రాజెక్టుకు సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.ఇది ఒక సాధారణ ఐటీ పార్క్ లేదా పారిశ్రామిక ప్రాంతం లాంటిది కాదు. డేటా సెంటర్ కంపెనీల ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా ప్లగ్-అండ్-ప్లే పద్ధతిలో మౌలిక సదుపాయాలను ఇక్కడ ముందే సిద్ధం చేస్తోంది ప్రభుత్వం. ఒకే ప్రాంగణంలో పవర్ సబ్‌స్టేషన్లు, హై-స్పీడ్ ఫైబర్ నెట్‌వర్క్‌లు, కూలింగ్ సిస్టమ్‌లు, బ్యాకప్ పవర్, అత్యాధునిక భద్రతా వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల వివిధ కంపెనీలు తమ వ్యాపారాల కోసం వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్, నీరు లేదా ఇంటర్నెట్ కనెక్షన్ల కోసం తిరగాల్సిన అవసరం ఉండదు. అతి తక్కువ సమయంలోనే తమ సర్వర్లను ఇక్కడ ఏర్పాటు చేసుకుని కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ ప్రాజెక్ట్ అత్యంత ప్రాధాన్యత కలిగిన, ప్రత్యేకమైన అంశం నీటి పునర్వినియోగం. డేటా సెంటర్లు రోజుకు 24 గంటలు పనిచేస్తాయి. కాబట్టి సర్వర్లు వేడెక్కకుండా చూడటానికి భారీగా నీరు అవసరమవుతుంది. తాగునీటిపై ఒత్తిడి పడకుండా ఉండేందుకు, ఇక్కడ మంచినీటికి బదులుగా శుద్ధి చేసిన మురుగునీటిని ఉపయోగించనున్నారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ కి చెందిన 41 మురుగునీటి శుద్ధి కర్మాగారాల నుండి సుమారు 530 శుద్ధి చేసిన నీటిని రెండు వేర్వేరు పైప్‌లైన్‌ల ద్వారా ఈ డేటా సెంటర్ నగరానికి, పారిశ్రామిక ప్రాంతాలకు సరఫరా చేయడానికి ప్రణాళిక సిద్ధం చేశారు.

## రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ప్రారంభమైన

# ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాల పంపిణీ



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ కు ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాన్ని అందచేస్తున్న రాజేంద్రనగర్ తహసిల్దార్, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ బొమ్మ రాములు



ఓటర్లకు ఎన్యూమరేషన్ దరఖాస్తు ఫారాలను అందచేస్తున్న నాయకులు

**బుద్వేల్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) లో బాగంగా అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని ఓటర్లకు బూత్ లెవల్ ఆఫీసర్లు శుక్రవారం ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాలను అందజేశారు. అత్తాపూర్ సర్కిల్ లో 249 పోలింగ్ బూత్ లు ఉం డగా, వాటిని రెండు విభాగాలుగా విభజించి 163 పోలింగ్ బూత్లకు అత్తా పూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డిని, మరో 86 పోలింగ్ బూత్ లకు రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు లను అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా నియమించారు. సర్కిల్ పరిధిలో 2,93,744 మంది ఓటర్లు ఉన్నారు. వారందరికి ఓటరు ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాలను వారం రోజుల పాటు అందజేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

**ఇతర రాష్ట్రాలు, జిల్లాలలో ఓట్లుండటంతో చాలా ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం :**

రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం లో ఇప్పటి వరకు 6.35, 283 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో చాలా మందికి ఇతర రాష్ట్రాలలో, ఇతర జిల్లాలలో ఓటు హక్కు ఉ ంది. ఓటరు ఎన్యుమరేషన్ దరఖాస్తు పారాలను అందజేస్తున్న సమయంలో చాలా మంది తమ స్వగ్రామంలోనే ఓటు ను ఉ ండేలా చూసుకుం టామని చెబుతున్నట్లు బూత్ లెవల్ ఆఫీసర్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం లో చాలా ఓట్లు పోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ కు ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాన్ని అందజేసిన ఏఈఆర్ఓ బి రాములు :**

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ కు శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ గా ఉన్న రాజేంద్రనగర్ తహసీల్దార్ బొమ్మ రాములు ఎన్యుమరేషన్ దరఖాస్తు పారాన్ని అందజేశారు. బీఎల్ ఓ రాహుల్ రెడ్డి, సూపర్ వైజరు మౌనిక లతో కలసి మైలార్దేవుపల్లి లో ఉన్న ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ ఇంటికి వెళ్లిన బొమ్మ రాములు ప్రకాశ్ గౌడ్ కు ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ దరఖాస్తు ఫారాన్ని తీసుకున్న ప్రతి ఓటరు క్షుణ్ణంగా దరఖాస్తును పరిశీలించి పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

# కిక్ బాక్సింగ్ లో రాణించిన రాణించిన భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ్ విద్యార్థులు



కిక్ బాక్సింగ్ లో రాణించిన చిన్నారులు



**బుద్వేల్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్ నగరంలో జూన్ 17 నుంచి 21 వరకు జరిగిన జాతీయ కిక్ బాక్సింగ్ చాంపియన్షిప్ 2026 లో రాజేంద్రనగర్ భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమ్ (బీవీబీవీ) విద్యార్థినీలు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో మజ్జిగ మనస్వీ యాదవ్ 32 కేజీ ల లైట్ కాంటాక్ట్ ఫైట్ విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రజత పతకం సాదించారు. బోయినపల్లి శ్రీనిక 18 కేజీల పాయింట్ ఫైట్ విభాగంలో స్వర్ణ పతకం కైవసం చేసుకుంది. సెప్టెంబరు లో ఇటలీ లో జరుగనున్న అంతర్జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు భారత్ తరపున పాల్గొననున్నారు. వీరిరువురిని పాఠశాల ప్రిన్సిపాల్ బి రవి కిరణ్ అభినందించారు.

# రంగారెడ్డి జిల్లా బీజేపీ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం



బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ తో పలుగుచెరువు నరేష్

**బుద్వేల్, జూన్ 26 (నమస్తే ఉదయం)**

బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ చేతుల మీదుగా శం షాబాద్ లో త్వరలో బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యాలయం ను త్వరలో ప్రారంభించుకోవడం జరుగుతుం దని, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉప్పర్ పల్లి కి చెందిన బీజేపీ నాయకులు పలుగుచెరువు నరేందర్ కోరారు. ఇదే విషయమై శుక్రవారం శంషాబాద్ లో జిల్లా బీజేపీ అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ తో జరిగిన సమావేశంలో పలుగుచెరువు నరేందర్ పాల్గొన్నారు. రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయం ప్రారం భోత్సవానికి రానున్న పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ కు ఘన స్వాగతం పలుకనున్నట్లు తెలిపారు. అందుకోసం ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.




తప్పిపోయిన బాలుణ్ణి తండ్రి కి అప్పగించిన పోలీసులు

## తప్పిపోయిన బాలుడిని తండ్రి చెంతకు చేర్చిన పోలీసులు

**బుద్వేల్,జూన్ 26 (నమస్తే ఉదయం) :**

తప్పిపోయిన బాలుడిని క్షేమంగా తండ్రి చెంతకు చేర్చారు అత్తాపూర్ పోలీసులు. అత్తాపూర్ ఇన్ స్పెక్టర్ నాగేశ్వర్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఎం ఎం పహాడి కి చెందిన ఫారూఖ్ కొడుకు షేక్ ఎజాజ్ (మూడున్నర సంవత్సరాలు) బాలుడు శు క్రవారం మధ్యాహ్నం తప్పిపోయి కేశ్వరి మసీదు సమీపంలో తనకు దొరికినట్టు మొబైర్ ఖురేషి అనే వ్యక్తి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చాడు. వెంటనే పోలీస్ స్టేషన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఇంతియాజ్, ఏ ఎస్ ఐ కుమారు లు బాలుడు ఫోటోను తీసి వివరాలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. దీంతో బాలుడి కోసం వెతుకుతున్న తండ్రి ఫారుక్ తన స్నేహితుల ద్వారా పోలీస్ స్టేషన్లో ఉన్నాడని సమాచారం తెలియడంతో వెంటనే పోలీస్ స్టేషన్ చేరుకున్నాడు. నమాజ్ చేయడానికి మసీదు లోపలికి వెళ్ళినప్పుడు బాబును ఇంట్లో ఒక్కడినే వదిలేసామని బాబు కోసం వెతుకుతుండగా వాట్సాప్ గ్రూపులో తమ స్నేహితుల ద్వారా సమాచారం అందిందని ఫారుక్ తెలిపాడు. బాలుడి గుర్తింపును ధ్రువీకరించిన తర్వాత పోలీసులు బాలుడిని సురక్షితంగా అప్పగించారు. పోలీసులకు ఫిర్యాదు చేద్దామనుకున్న నేపథ్యంలో పోలీసులే ముందస్తుగా తమ బాబును గుర్తించి క్షేమంగా అప్పగించడం పై సంతోషం వ్యక్తం చేశాడు.

## రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జిగా సదాల వెంకట్ రెడ్డి

**బుద్వేల్ , జూన్ 26 (నమస్తే ఉదయం) :**



రాజేంద్రనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జిగా శివరాంపల్లికి చెందిన సదాల వెంకట్ రెడ్డిని నియమిస్తూ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శు క్రవారం నియామక పత్రాన్ని కార్తీక్ రెడ్డి వెంకట్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు, సరికొత్త సాంకేతికతతో కూడిన డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియకు పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శ్రీకారం చుట్టారని తెలిపారు. రాజేంద్రనగర్ డివిజన్ లో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కాలనీల వారీగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని సూచించారు.సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తిస్తుందని చెప్పారు.

## లండన్‌లో కామారెడ్డి యువకుడి అనుమానాస్పద మృతి

### మరణవార్తతో కన్నీరుమున్నీరయిన తల్లిదండ్రులు

**కామారెడ్డి,జూన్26 (నమస్తే ఉదయం) :**



లండన్‌లో తెలంగాణకు చెందిన ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం తలమడ్ల గ్రామానికి చెందిన సావుసాని శ్రీనాథ్ రెడ్డి (25) రెండు రోజుల క్రితం అనుమానాస్పద రీతిలో మృతి చెందాడు. ఉన్నత చదువుల కోసం శ్రీనాథ్ గతేడాదే లండన్‌కు వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. మధుసూదన్ రెడ్డి, మంజుల దంపతుల కుమారుడు శ్రీనాథ్ రెడ్డి లండన్‌లోని లీసెస్టర్ యూనివర్సిటీలో ఎంఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. రెండు రోజుల క్రితం స్నేహితుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన శ్రీనాథ్.. రాత్రి అక్కడే నిద్రించాడు. తెల్లవారేసరికి విగతజీవిగా పడి ఉన్నట్లు స్నేహితులు అక్కడే ఉ న్న శ్రీనాథ్ బంధువులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకొని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈ మరణ వార్తతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లిన తమ కుమారుడు కానరాని లోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. శ్రీనాథ్ మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వగ్రామానికి తీసుకువచ్చేలా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



నిష్పత్తి కుదిరితేనే..

# ముద్దముద్దలో ఘాటు

భారతీయుల వంటగదిలో అల్లం-వెల్లుల్లి పేస్ట్ కచ్చితంగా ఉండాల్సిందే! శాకాహారమైనా, మాంసాహారమైనా.. ఓ టేబుల్ స్పూన్ అల్లం, వెల్లుల్లి ముద్ద పడాల్సిందే! అయితే, ప్రస్తుత కల్తీల కాలంలో.. అల్లం-వెల్లుల్లి పేస్ట్‌ను ఇంట్లో తయారు చేసుకోవడమే మంచిది! అయితే, దీన్ని నిల్వ ఉంచితే కొద్ది రోజులకే రుచి మారిపోతుంది. అలాకాకుండా.. అల్లం-వెల్లుల్లి ముద్ద ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే ఈ చిట్కాలు పాటించండి.

అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీలో రెండిటినీ సరైన నిష్పత్తిలో తీసుకోవడం ముఖ్యం. 60 శాతం వెల్లుల్లి ఉంటే.. 40 శాతం అల్లం ఉండేలా చూసుకోవాలి. రెండింటి పొట్టును పూర్తిగా తీయాలి. లేకుంటే, దానిపై ఉండే తొక్క వల్ల పేస్ట్ రుచి మారుతుంది. త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుంది.

నిల్వ ఉంచేవి ఏవైనా.. తేమ తగిలితే పాడవుతాయి. అల్లం-వెల్లుల్లి పేస్ట్ కూడా అంతే! అందుకే, అల్లం ముక్కలను శుభ్రంగా కడిగిన తర్వాత.. తేమ లేకుండా పొడి వస్త్రంతో తుడవాలి. ఆ తర్వాతే మిక్సీ పట్టుకోవాలి. దీనివల్ల పేస్ట్ ఎక్కువకాలం తాజాగా ఉంటుంది.

ఈ పేస్ట్‌కు ఒకటిన్నర టేబుల్ స్పూన్ పల్లి నూనె గానీ, పొద్దుతిరుగుడు నూనె గానీ, ఒక టీ స్పూన్ ఆలివ్ నూనె గానీ, కొద్దిగా ఉప్పు కలుపుకోవాలి. దీనిని గాలి చొరబడని గాజు సీసాలో నిల్వ చేసుకోవాలి. నూనెలు, ఉప్పు సహజసిద్ధమైన ప్రిజర్వేటివ్‌లా పనిచేస్తాయి. పేస్ట్ ఎక్కువ కాలం నిల్వ ఉండేలా చేస్తాయి.

అప్పుడప్పుడూ అల్లం-వెల్లుల్లి పేస్ట్ ఆకుపచ్చ లేదా పసుపు రంగులోకి మారుతుంటుంది. ఇలా రంగు మారడం పేస్ట్ పాడవుతున్నది అనడానికి ఓ సంకేతం! మిశ్రమంలో టీస్పూన్ నిమ్మరసం వేసి కలిపి, గాలి చొరబడని డబ్బాలో వేసి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. తాజాగా ఉంటుంది.

# భద్రం.. బీ కేర్‌ఫుల్ బ్రదర్

## ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే అంతే సంగతి



ప్రతీ ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అయితే అది లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటున్నారు. మరి నిపుణులేమంటున్నారో చూద్దాం.

### అవగాహనతో..

ప్రతీదానిపై అవగాహన ఉంటేనే లాభమైనా.. విజయమైనా దక్కుతుంది. ముఖ్యంగా ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనేనని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

### అతితో అనర్థాలే..

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. ఓ సర్వే ప్రకారం మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15-20 శాతం స్టాక్స్.. మీకున్న రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

### బీమాను మరువద్దు

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

### రుణ భారం

అవసరమున్నా, లేకున్నా నేడు చాలామంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనివల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పుచేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ-వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. మున్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను ఆంటకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

### చివరగా..

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే కనీసం 6 నెలల అవసరాలు తీరేలా అత్యవసర నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.

### పొదుపుతోనే రక్ష

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొందికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.

## నువ్వులను ఇలా వాడితే మీ ముఖం

# కాంతివంతంగా మారి మెరిసిపోతుంది



నువ్వులను మనం తరచూ వంటల్లో ఉపయోగిస్తూనే ఉంటాం. నువ్వుల నుంచి తీసిన నూనెను కూడా మనం వాడుతుంటాం. నువ్వుల్లో ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని సంరక్షించి కాంతిని ఇస్తాయి. చర్మంపైన ఉండే పొరను రక్షిస్తాయి. నువ్వుల్లో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. అందువల్ల నువ్వులు చర్మ సౌందర్యానికి ఎంతగానో ఉపయోగపడతాయి. నువ్వుల నుంచి తీసిన నూనెనే ముందుగా మానవులు వాడడం మొదలు పెట్టారని చరిత్ర చెబుతోంది.

మనిషి నువ్వుల నూనెనే ముందుగా వాడినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. నువ్వుల నూనెలో మెగ్నిషియం, ఒమెగా 6 ఫ్యాటీ యాసిడ్లు, ఐరన్, అనేక రకాల బి విటమిన్లు, విటమిన్ ఇ, క్యాల్షియం సమృద్ధిగా ఉంటాయి. ఒక టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో ఒక టీస్పూన్ పెరుగు వేసి కలపాలి. ఇందులోనే చిటికెడు పసుపు వేయాలి. కొన్ని చుక్కల తేనె వేసి బాగా కలపాలి. దీంతో ఫేస్ ప్యాక్ రెడీ అవుతుంది. దీన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలు అయ్యాక చల్లని నీటితో కడిగేయాలి. దీని వల్ల ముఖంపై ఉండే రంధ్రాలు మూసుకునిపోతాయి, చర్మానికి తేమ లభిస్తుంది. చర్మం టైట్‌గా మారి కాంతివంతంగా తయారవుతుంది.

1 టీస్పూన్ నువ్వుల పొడిని తీసుకుని అందులో కొన్ని చుక్కల పాలు లేదా తేనె కలిపి ఒక స్క్రబ్ క్రియేట్ చేయాలి. దీన్ని అప్లై చేస్తుంటే ముఖంపై ఉండే మృత చర్మ కణాలు పోతాయి. మురికి, ధూళి, దుమ్ము కూడా పోతాయి. నువ్వుల నూనెను మీరు ముఖానికి నేరుగా కూడా అప్లై చేయవచ్చు. నువ్వుల నూనెను ముఖానికి రాసిన తరువాత కాసేపు ఆగి కడిగేయాలి. ఇలా చేస్తుంటే చర్మానికి మెరుపు లాంటి లుక్ వస్తుంది. చర్మం కాంతితో మెరిసిపోతుంది.

అర కప్పు నువ్వుల నూనె, అర కప్పు యాపిల్ సైడర్ వెనిగర్, పావు కప్పు నీళ్లను తీసుకుని బాగా కలిపి ఈ మిశ్రమాన్ని ముఖానికి రాత్రి పూట రాయాలి. మరుసటి రోజు ఉదయం కడిగేయాలి. ఇలా రోజూ చేస్తుంటే చర్మం టైట్‌గా మారుతుంది. చర్మం మృదువుగా తయారవుతుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది.

2 కప్పుల బ్లాక్ టీనికాచి అందులో 3 టేబుల్ స్పూన్ల నువ్వులను వేయాలి. మిశ్రమాన్ని చల్లార్చిన తరువాత వడకట్టాలి. అందులో ఒక టేబుల్ స్పూన్ కొబ్బరిపాలను కలపాలి. ఈ మిశ్రమాన్ని గాలి చొరబడని కంటెయినర్‌లో నిల్వ చేయాలి. దీన్ని రోజూ ఉదయం క్లీన్సర్‌లాగా వాడుకోవచ్చు.

ఒక టేబుల్ స్పూన్ నువ్వుల పొడి, ఒక టేబుల్ స్పూన్ పెరుగు, తేనె కలిపి మిశ్రమంగా చేసి ఈ ఫేస్ ప్యాక్‌ను ముఖానికి రాయాలి. కొంత సేపు అయ్యాక కడిగేయాలి. వారంలో ఇలా 2 సార్లు చేయాలి. దీంతో చర్మం తిరిగి పూర్వ రూపాన్ని పొందుతుంది. ఇలా నువ్వులు లేదా నువ్వుల పొడి, నువ్వుల నూనెను వాడి చర్మ సౌందర్యాన్ని పెంచుకోవచ్చు.